# గొడుగు



ఆబిడ్స్ ఫుట్‌పాత్ మీద పాత పుస్తకాలని ఒంగి చూస్తున్న నాకు, తలెత్తేసరికి ఎదురుగా అతను కనిపించాడు.

ఎక్కడ చూశానబ్బా అని అనుకుంటుండగానే చటుక్కున గుర్తుకొచ్చాడు అతను...విజయ... విజయభాస్కర్!

"మీరు?..." అతన్ని పలకరించాను.

తను నన్ను చూస్తూనే గుర్తుపట్టేశాడు.

"ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు!" ఆనందంగా చేతులు కలిపాడు అతను. తాడేపల్లిగూడెంలో టెన్త్ క్లాస్‌మేట్. టెన్త్ తర్వాత నాన్నగారి ట్రాన్స్‌ఫర్ వల్ల ఆ వూరును వదిలేశాం. మళ్ళీ వెళ్ళనే లేదు ఎప్పుడూ. చదువైన తర్వాత రిజర్వ్ బ్యాంక్‌లో ఉద్యోగం రావడంతో హైదరాబాద్‌లో ఉంటున్నా.

"ఊరు బాగుందా...సంత మార్కెట్...సినిమా హాళ్ళు...ఏలూరి కాల్వ...రైలు స్టేషన్...బావున్నాయా? మన ఫ్రెండ్సంతా బావున్నారా?" ఏకబిగిన అడిగేశాను. నవ్వుతూ తలూపాడు.

"నువ్వు వూరు వొదిలేసింతర్వాత మళ్ళీ కనిపించనే లేదు" అన్నాడు విజయ.

"అవును. అప్పుడప్పుడు అనిపించేది ఒకసారి గూడెం వెళ్ళాలని. అవునూ ఒక్కసారి మాత్రం మన క్లాస్‌మేట్ ఇంకా కరెక్ట్‌గా చెప్పాలంటే మన బెంచ్‌మేట్ కనక రత్నం మద్రాస్‌లో కనిపించాడు. వాడూ మన క్లాస్‌మేట్ ప్రసాదూ కలిసి మద్రాస్‌లోనే బిజినెస్ చేస్తున్నారట కదా! ఆ రోజుల్లోనూ ఎప్పుడూ కలిసే తిరిగేవారు. వాళ్ళిద్దరి మధ్యా ఎంత స్నేహమో! మనలాంటి వాళ్ళు విడిపోయినా వాళ్ళు మాత్రం కలిసి చక్కగా వ్యాపారం చేస్తున్నారు ఇట్స్ నైస్ థింగ్!" ప్రశంసగా అన్నాను.

అదోలా నవ్వుతూ అడిగాడు విజయ-"ఎన్నాళ్ళ క్రితం కలిశాడేం రత్నం నిన్ను?"

"ఆర్నెల్ల క్రితం అనుకుంటాను"

"అదీ సంగతి-ఇప్పుడు వాళ్ళు ఫ్రెండ్స్ మాట అటుంచి-కనీసం బిజినెస్ పార్టనర్స్ కూడా కాదు బద్ధ శత్రువులు" అన్నాడు.

"అదేం?"

"అదా!...తలకి సంబంధించిన రెండు వ్యవహారాలవల్ల వాళ్ళ మధ్య మిత్రత్వం చెడిపోయి-బద్ధ విరోధులయ్యారు..." అతని మాటని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూ పజిల్‌ని సాల్వు చేస్తున్నప్పటి మొహం పెట్టాను.

విజయ మాట తీరేం మారలేదు. అప్పుడూ అంతే !...అతని మాటలకి సదా ఒక రకమైన పరదా ఫ్లేవర్!

తన మాటకి తనే చిక్కుముడి విప్పుతూ చెప్పాడు విజయ.

"ఏముంది...రత్నం తన బిజినెస్ పార్టనర్‌కి అదే ప్రసాదుగాడికి టోపీ పెట్టాడు. ఆ టోకరాతో ఆర్థికంగా బాగా దెబ్బతిన్న ప్రసాదు నెత్తిన చెంగేసుకోవాల్సి వచ్చింది" నవ్వాడు విజయ.

నా మనసెందుకో చివుక్కుమంది. ఆ రోజుల్లో వాళ్ళిద్దరూ ప్రాణ స్నేహితులు మరి...

ఏదో జ్ఞాపకానికి వచ్చి... "అన్నట్టు వాళ్ళు చేసింది రకరకాల టోపీల్ని తయారుచేసే బిజినెస్ కదూ?" అడిగాను.

తలూపాడు తను.

"వృత్తి ప్రవృత్తిలోకి ఎన్‌క్రోచ్ అవ్వడం అంటే ఇదే కాబోలు" అన్నాను బాధగా నవ్వుతూ. తనూ నాతో జత కలిపాడు.

ఇంతలో సన్నటి వర్షం మొదలైంది హఠాత్తుగా.

షోల్డర్ బాగ్‌లోంచి ఫోల్డింగ్ గొడుగు తీశాను.

గొడుగు తెరుస్తూ దానికిందకి తనని రమ్మన్నట్టు సైగ చేశాను. అంతవరకూ మా మధ్య నడిచిన సంభాషణని గుర్తుచేసుకుంటూనో, లేదా గొడుగు తాలూకు గుడ్డ తెల్లటిది కావడం వల్లనో గాని, గొడుగు కింద తలదాచుకోడానికి సందేహిస్తున్నట్టు మొహం పెట్టాడు. అతని కళ్ళు మాత్రం అల్లరిగా నవ్వుతున్నాయి.

"ఏ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఏ ఫ్రెండ్ ఇన్ డీడ్!" అన్నాను నవ్వుతూ.

"నిజం...నీడ నిచ్చేదే స్నేహం!" గొడుగు కిందకి వస్తూ అన్నాడు విజయ. ఈసారి మాత్రం అతని గొంతు సీరియస్‌గా వుంది.

ఎస్. హన్మంత్రావ్